

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## – కస్తూరి మురళీకృష్ణ

**ఫిర్ ఛిడీ రాత్ బాత్ ఫూలోంకీ**

**రాత్ హై యా బారాత్ ఫూలోంకీ**

హిందీ సినీగీత ప్రపంచంలో కొన్ని గీతాలుంటాయి. అవి వింటూంటేనే మనస్సు మహదానంద సంద్రపు అలలపై తేలియాడుతుంది. ఒక మధురమైన పరిమళం మనస్సునంతా ఆవరిస్తుంది. చిరుగాలి తాకిడికే కంపించిపోయే అతి సున్నితమైన భావనలు తనువును, మనస్సును ఆవరిస్తాయి. తీయని భావనతో అలవికాని మృదుమధురమైన ఆనంద తరంగం ఎగసిపడుతుంది. ప్రశాంత సాగరంపై ప్రయాణిస్తూ నల్లటి ఆకాశంలో మిలమిల మెరిసే పూలలాంటి తారల పరిమళాలు ఆఘ్రాణిస్తూన్న అనుభూతి కలుగుతుంది. అలాంటి అనిర్వచనీయమైన ఆనందానుభూతులను అత్యంత మృదువైన రీతిలో కలిగించే గుసగుసల కన్నా నాజూకయిన గీతం ఇది. 'బాజార్' సినిమాలో లత, తలత్ అజీజ్ లు పాడిన ఈ పాట మరుపురాని మధురమైన యుగళగీతాలలో అగ్రస్థానం వహిస్తుంది. అర్ధరాత్రి పూట ప్రేయసి ప్రియుడికోసం ఎదురు చూస్తూ పాడే బాగెశ్రీ రాగంలో ఈ పాటను ఖయ్యాం రూపొందించాడు. ఖయ్యాం ఉర్దూ కవిత్వప్రపంచం అంటే అతి ఇష్టం కలవాడు. ఆయన పాటను రూపొందించేముందు గీతాన్ని అనుభవిస్తాడు. కవి హృదయంతో స్పందిస్తాడు. ఆపై బాణీ సృజిస్తాడు. అందుకే ఖయ్యాం రూపొందించిన పాటలన్నీ సాహిత్యపరంగా అత్యుత్తమ స్థాయిలో వుంటాయి.

ఈ పాటను మామూలు సినీకవి రాయలేదు. ఈ పాట ఒక గొప్ప కవి తన ఆనందం కోసం రాసుకున్నాడు. దర్శకుడు సాగర్ సర్హది. సాగర్ సర్హది కథకుడు, నాటక రచయిత, దర్శకుడు, నిర్మాత . ఉర్దూ సాహిత్యంపై అత్యంత పట్టు ఉన్న వ్యక్తి. కభీకభీ, నూరీ, సిల్సిలా, చాంద్ని వంటి సినిమాల రచయిత. గమనిస్తే, సాగర్ సర్హది సంభాషణలు రాసిన సినిమాలన్నీ సాహిత్య పరంగా అత్యుత్తమ స్థాయిలో ఉంటాయి. ఆయన దర్శకత్వం వహించిన 'బాజార్' వీటన్నిటికీ పరాకాష్టలాంటిది సాహిత్యపరంగా.

'బాజార్' సినిమాలో పాటలకోసం సాగర్ సర్హదీ పూర్తిగా ఉర్దూ కవితా ప్రపంచంలో పేరు పొందిన కవుల కవితలపై ఆధారపడ్డాడు. మిర్జాషాల్, మీర్ తకీమీర్, బషర్ నవాజ్ వంటి వారి కవితలను అత్యంత సుందరమైన రీతిలో వాడుకుని సినిమాకు సాహిత్య గంధాన్ని అద్దాడు. వాటిలో అగ్రస్థానం వహిస్తుంది. మఖ్దూం మొహియుద్దీన్ రాసిన పూల పరిమళాలను విరజిమ్మే ఈ పూరేకులంత సున్నితమైన పాట.

హైదరాబాదులో ప్రోగ్రెసివ్ రైటర్స్ యూనియన్‌ను స్థాపించినవాడు, కమ్యూనిస్టు పార్టీలో చురుకుగా పాల్గొన్నవాడు, రాజకీయాల కోసం కవితను త్యాగం చేసినవాడు ముఖ్దూం మొహియుద్దీన్. సుర్ఖ్‌సవేరా, గుల్ – ఎ – తార్ వంటి కవితా సంపుటాలను వెలువరించాడు. ఆయన కవితలన్నీ 'బిసత్ – ఎ – రఖ్స్ ' అన్న పుస్తకంలో పొందుపరచారు. ఈ పుస్తకానికి ఆయనకు సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. అంతటి పేరు ప్రఖ్యాతులున్న ఉర్దూకవి ముఖ్దూం కవితలను సినిమాలలో వాడటం ఇది తొలిసారికాదు.

ఇఖ్బాల్ ఖురేషీ సంగీత దర్శకత్వం వహించిన 'చచచ' అనే సినిమాలో ముఖ్దూం కవితను పాటగా మలచారు.

**ఎక్ చమేలీ కే మండ్వే – తలే**

**మై – కదే సె జరా దూర్ ఉస్ మోడ్ పర్**

**దోబదన్**

**ప్యార్‌కి ఆగే మే జల్ గయే**

ఉర్దూ కవితలో సంస్కృత పదాలు దొర్లటం ఈ కవితలో చూడవచ్చు. సినిమాలో ఈ పాటను యుగళగీతంలా మలచారు. 'చమేలీ' అన్నది సంస్కృత పదం. చమేలీ అంటే మల్లెపూవు. మల్లెపూల తీగ నీడన, లేత మల్లె పొదనీడన, మద్యం దుకాణానికి దూరంగా మలుపులో, రెండు శరీరాలు ప్రేమ అగ్నిలో దగ్ధమైపోతున్నాయి అన్న పల్లవితో ఆరంభమవుతుంది ఈ పాట.

'మఖ్దూం'ను విప్లవ కవి అంటారు. కానీ సినిమాలో వాడటం కోసం ఎన్నుకున్న కవితలలో మృదుమధుర శృంగార రస ప్రవాహం పరిమళిస్తుంది తప్ప విప్లవ భావాల నిప్పుకణికలు కణకణలాడవు. రఫీ, ఆశాలు ఎంతో మధురంగా, ఆర్తితో గానం చేస్తారు ఈ పాటను. ఈ పాటలో, ముఖ్దూం రాసిన 'చారా – గర్' కవితను ఎలాంటి మార్పులు లేకుండా

యధాతదంగా వాడారు. సాధారణంగా కవితలలో కవి స్వేచ్ఛగా తన కవితలో భావాన్ని ఇనుమడింపచేసే పదాలు వాడతాడు. జనసామాన్యానికి అవి అర్ధమౌతాయా అన్న సంశయం,సందిగ్ధాలు  కవులకు ఉండవు. కానీ అవే కవితలు సినిమాలో పాటలుగా రూపాంతరం చెందే సమయంలో సినీ కళాకారుల దృష్టి సాహిత్య ప్రపంచ  పెద్దల మెప్పుపై కన్నా సామాన్యుడిని సైతం మురిపించటం పై ఉంటుంది. పైగా, సినిమా పాటగా రూపాంతరం చెందే కవిత బాణీ బంధనాలలో ఒదగాల్సి ఉంటుంది. కాబట్టి బాణీని, సామాన్యుల భాషా, పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని కవితను మారుస్తారు.

**యె కూచే యె నీలాం ఘర్ దిల్ కషీ కే**

**యె లుట్తే హువే కార్వాన్ జిందగీ కే**

**కహాఁ హై కహాఁ హై ముహాఫిజ్ ఖుదీ కె**

**సనా – ఖ్వాన్ –ఎ – తక్దీస్ – ఎ మష్రిక్ కహాఁ హై**

సాహిర్ లూధియాన్వీ రాసిన 'చక్లే' కవిత ఎంతో ప్రజాదరణ పొందింది. ఉర్దూ సాహిత్య ప్రపంచాన్ని ఒక్క కుదుపు కుదిపింది. 'ప్యాస' సినిమాలో వేశ్యవాటికలో నాయకుడు కవితను గానం చేసే సందర్భాన్ని 'గురుదత్' ఈ కవితను వాడటం కోసమే సృష్టించాడు. అయితే బాణీ దగ్గరకు వచ్చేసరికి పై పంక్తులలో చివరి పంక్తి దగ్గర సమస్య వచ్చింది.

'సనా – ఖ్వాన్ – ఎ – తక్దీస్ – ఎ – మష్రిక్' అంటే 'తూర్పువైపు గొప్పతనాన్ని గానం చేసేవారు ' అన్న అర్ధం వస్తుంది. ఇతరులను పాశ్చాత్యులని ఈసడిస్తూ, తూర్పువైపు నాగరికతలను గొప్పవని కీర్తించేవారందరూ ఎక్కడున్నారు? అని కవి అడుగుతున్నాడు. ఇది అందరికీ అర్ధమవటం కష్టం. బాణీలో ఒదిగినా కవితను గానం చేసేప్పుడు ప్రకటితమయ్యే తీవ్రత తగ్గుతుంది.  అందుకని సినిమాలో ఈ పాదం 'జినే నాజ్ హై హింద్ పర్వో కహా హై?' అన్న ప్రశ్నగా రూపాంతరం చెందింది. ఇది అందరికీ సులభంగా అర్ధమవుతుంది. పాట ప్రవాహం సాఫీగా సాగిపోతుంది. అనేక  కవితలు ఇలా సినీగీతంగా రూపొందే సమయంలో కొద్దిగా మార్పులు  పొందాయి. ముఖ్ధాం కవితలు మాత్రం ఎలాంటి మార్పులు లేకుండా ఉన్నవి ఉన్నట్టుగా సినిమాలలో వాడారు.

'ఫిర్ ఛిడీ రాత్' పాటలో మొత్తం ఇరవై పాదాలుంటాయి. సినిమాలో అన్నీ వాడలేదు. ఉన్న వాటిలో సులభంగా అర్ధమయ్యేవి, రొమాంటిక్ భావనను ఇనుమడింపచేసేవీ అయిన వాటిని వాడారు.

'ఛిడీ' అన్న పదం గమ్మత్తయినది. 'ఛిడీ' అంటే ఆరంభం అన్న అర్ధం వస్తుంది. 'ఫిర్ ఛిడీ రాత్ బాత్ పూలోంకీ' అంటే పూలమాటల రాత్రుళ్లు గురించిన మాటలు మళ్లీ ఆరంభమయ్యాయి అన్న అర్ధం వస్తుంది. పూల గురించి మాట్లాడే రాత్రుళ్లు అంటే ప్రేయసీ ప్రియులు కలసి ఏకాంతంగా ప్రేమలో గడిపే మధురమైన రాత్రుళ్లు అన్నమాట.

'బారాత్' అంటే ఊరేగింపు. ఇది రాత్రియా, పూల ఊరేగింపా?' అంటోంది నాయిక. పూలు మధురమైన భావనలకు ప్రతీక.

'మధుర భావాల సుమమాల మనసులో పూచెనీవేళ' అన్న భావనను పూలపై ఆరోపించి అతి సున్నితంగా ప్రకటిస్తున్నాడన్నమాట కవి. ఇలా ఒకే అంశాన్ని తీసుకుని కవితను పొడిగించటాన్ని 'నజ్మ్' అంటారు. అయితే ఈ కవిత , గజల్.

**పూల్ కే హార్ పూల్ కే గజ్రే**

**షాం పూలోంకి, రాత్ పూలోంకీ**

పూల హారం. పూల కంకణాలలో ఉన్న సాయంత్రం, రాత్రి పూలకు అంకితం అంటున్నాడు కవి. పూలహారం సులభంగా అర్ధం అవుతుంది .'గజ్రా' అంటే పూలు దట్టంగా కూర్చిన హారం. వివాహాల సందర్భంలో పండుగల సందర్భంలో జడ మొత్తాన్ని పూలతో నింపుతారు. పూలజడ అంటారు. అలాంటి వాటితో నిండినాయట ఆ సాయంత్రం, ఆ రాత్రి.

**ఆప్ కా సాథ్, సాథ్ పూలోంకా**

**ఆప్ కే బాత్, బాత్ పూలోంకా**

ఆమె సాంగత్యం పూలతో సాంగత్యం వంటిదట. ఆమె మాటలు, పూలకు సంబంధించిన మాటల్లాంటివట. అంతే అందమూ, సౌకుమార్యమూ, అద్భుతమూ పరిమళ భరితమైనటువంటివన్నమాట ఆమె మాటలు. అంటే వారి సాంగత్యము, సంభాషణలు పూలు అంత తీయనివి, పరిమళ భరితాలు అన్నమాట.

**నజ్రె మిల్తీ హై, జాం మిల్తీ హై**

**మిల్ రహీహై హయాత్ పూలోం కీ**

పూల జీవితం లభిస్తోందట. ఇక్కడ బహుమతులు, మద్యం కూడా లభిస్తున్నాయట. ఇక్కడ అందమైన జీవిత మద్యం లభిస్తోందని గ్రహించాలి. 'హయత్' అంటే 'జీవితం'

**పూల్ ఖిల్తే రహేంగె దునియామే**

**రోజ్ నిక్ లేగి బాత్ పూలోంకి.**

ప్రపంచంలో పూలు పూస్తూనే ఉంటాయి. పూల గురించిన సంభాషణ రోజూ నడుస్తూనే ఉంటుంది. సాధారణంగా, కవితలో పైకి అర్ధమయ్యే విషయం అసలు విషయంకాదు. కవి హృదయం గ్రహించాలి. పదాలలో దాగిన ప్రతీకలు గ్రహించాలి. వాటిద్వారా కవిత భావాన్ని గ్రహించాలి. అప్పుడు అసలు ఆనందం లభిస్తుంది. కొబ్బరి నీళ్ల కమ్మదనం, కొబ్బరి మృదుత్వం, అద్భుతమైన రుచి తెలుసుకోవాలంటే పైనున్న చిప్పను పగలు గొట్టాల్సిందే. ఈ కవితలో పూల స్థానంలో 'ప్రేమ' అన్న పదాన్ని ఉంచి కవిత చదివితే కవిత అర్ధం మారిపోతుంది. పూలు ప్రపంచంలో పూస్తూనే ఉంటాయి. రోజూ పూల గురించిన సంభాషణలు సంభవిస్తూనే ఉంటాయి, అన్న అర్ధాన్ని మామూలుగా తీసుకుంటే, పూలు పూస్తాయి. దేవుడికి అర్పించేందుకు పూల గురించి మాట్లాడుకుంటాం. జడలో అలంకరించేందుకు మాట్లాడుకుంటాం. చర్చిస్తాం, ప్రేయసి తలలో ముడుచుకునేందుకు పూల గురించి ప్రియుడు ఆలోచిస్తాడు, ప్రియుడిని అలరించేందుకు పూల గురించి ప్రేయసి ఆలోచిస్తుంది. పెళ్లిలో అలంకరణకు, శవాన్ని కప్పేందుకు ఇలా పూల గురించి సంభాషణలు ఏదో ఓ రూపంలో వస్తాయనుకోవచ్చు. పూల బదులు 'ప్రేమ' అన్న పదం ఉంచితే, ఎన్ని తరాలయినా ప్రేమికులు పుడుతూనే ఉంటారు. ప్రేమ గురించిన సంభాషణలు చెలరేగుతూనే ఉంటాయి అన్న భావన కలుగుతుంది పాటలో 'పూలు' అని ఉన్న ప్రతి స్థలంలో 'ప్రేమ' అని చదివితే భావం మరింత గొప్పగా అనిపిస్తుంది. సినిమా పాటలో వాడుకున్న పంక్తుల వల్ల ఈ భావన సందేహాస్పదంగా అనిపిస్తుంది. సినిమాలో వాడకుండా వదిలిన పంక్తులు తెలుసుకుంటే, పైకి పూల గురించి మాట్లాడుతున్నా, కవి ప్రేమ గురించి ఒక స్థాయిలో స్త్రీల గురించి మరో స్థాయిలో మాట్లాడుతున్నాడని సులభంగా బోధపడుతుంది.

**వో షరాఫత్ తో దిల్ కె సాథ్ గయీ**

**లుట్ గయీ కార్నాత్ పూలోంకా...**

ఆ మర్యాద హృదయంతో పాటు వెళ్లిపోయింది. పూల ప్రపంచం సర్వనాశనమైపోయింది. 'షరాఫత్' అంటే గౌరవం, మర్యాద, రాజసం, సత్ప్రవర్తన వంటి పలు అర్థాలు వస్తాయి. హృదయం పోయింది. హృదయంతో పాటు ఇవన్నీ పోయాయి. దాంతో పూల ప్రపంచం నాశనమై పోయింది 'లూట్' అంటే దోపిడీ, దొంగతనానికి గురవటం అన్న అర్థం వస్తుంది.

**అబ్ కిసే హై దిమాంగ్ – ఎ – తాహ్మత్ – ఎ – ఇష్క్**

**కౌన్ సున్తాహై బాత్ పూలోంకీ..**

ఇప్పుడు ప్రేమలో అన్ని ఆరోపణలను ఎదుర్కునేవారు ఎవరు? అంటే ప్రేమలో కష్టాలను ఎదుర్కునేవారెవరు? ఇప్పుడు పూల మాటలను పట్టించుకునేవారు ఎవరు? ఎలాంటి సందేహం లేకుండా కవి, ప్రేమ గురించి, పూవు వంటి స్త్రీ హృదయం గురించి మాట్లాడుతున్నాడు.

**మేరె దిల్‌మె సురూర్ – ఎ – సుబహ – ఎ – బహార్**

**తెరె ఆంఖోంమే రాత్ పూలోంకీ**

'నా హృదయంలో సంతోషకరమైన ఆనందం, నీ కళ్లల్లో పూల రాత్రిళ్లు' ఇక్కడ కవి బయట పడిపోయాడు. ప్రేమ అసలు అర్థం తమకే తెలుసని ప్రేమికులు అనుకుంటారు. ఇప్పుడు వీరిద్దరికీ తెలుసు ప్రేమ అంటే. ప్రపంచంలో ప్రేమను గ్రహించి, అనుభవించే శక్తి పోయింది. ఇప్పుడు ఎవరికి కావాలి ఆమె కళ్లల్లో కదలాడే పూలలాంటి ప్రేమరాత్రుళ్లు?

**యే మహక్తీ హుయీ గజల్ ముఖ్దూం**

**జైసె సెహరా మె రాత్ పూలోంకీ.**

'సెహరా' అంటే ఎడారి, పచ్చదనం, నీళ్లు, చెట్లు ఉండని ప్రాంతం. ముఖ్దూం రచించిన ఈ గజల్, ఎడారిలో పూల రాత్రి వంటిదట. ఈ చివరి పంక్తులు సినిమా పాటలో వాడుకున్నారు. సినిమాలో నాయికా నాయకుల సున్నితమైన ప్రేమను ప్రదర్శించాలి. అందుకని, ప్రేమను ఎవ్వరూ అర్థం చేసుకోలేరని, ప్రేమ విలువ గౌరవాలు తగ్గిపోయాయి అన్న ఆలోచనను కనబరిచే పంక్తులను సినిమాలో వాడలేదు. ఎందుకంటే, సినిమాలో కనిపించేది అమాయకమైన అప్పుడే వికసించే మొగ్గల్లాంటి యువతీ యువకుల నడుమ ప్రేమ.

తలత్ అజీజ్ స్వరంలోని లేతదనం, మృదుత్వం ఫరూఖ్ షేక్‌కు సరిగ్గా సరిపోతుంది. లతా స్వరం యువతి సుప్రియా పాఠక్ కు అచ్చు గుద్దినట్టు సరిపోవటం, ఆమె స్వరంలోని మౌగ్ధ్యం, లాలిత్యం, పూలలోని నాజూకుతనం వంటి నాజూకుతనం అత్యద్భుతం. పాట వింటూంటే నిజంగా పూల పరిమళం సర్వత్రా వ్యాపిస్తుంది. ఆనంద పరిమళం నలుదిశల విస్తరిస్తుంది. ఎంత విన్నా తనివి తీరదు. ఎన్ని మార్లు విన్నా ఇంకా వినాలనిపిస్తుంది. ఇలాంటి కవితలను సినిమా పాటలుగా మలచటంవల్ల సామాన్య జనులకు సైతం కవిత్వ గంధపు చల్లదనం, పరిమళాలు చేరువ చేర్చినట్టవుతుంది. సంస్కారవంతమైన ప్రేమ పూరేకులంత అద్భుతమైనది, మృదువైనది, పరిమళ భరితమైనది అని నిరూపించినట్టవుతుంది.

(వచ్చేనెల మరిన్ని ఉర్దూ కవితల పాటలతో కలుద్దాం..)

Click here to share your comments